
సాక్షి
పల్నాడు

శనివారం । 30 । ఆగస్టు । 2025



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 2,41,566 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు దిగువకు 2,42,132 క్యూసెక్కులు వదులుతున్నారు.



పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

దుగ్గిరాల: విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ డెల్టాకు 4,513 క్యూసెక్కులు శుక్రవారం విడుదల చేసినట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా ఫారూఖ్



గుంటూరు లీగల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రస్తుతం లేబర్ కోర్టు అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది (ఏజీపీ)గా ఉన్న షేక్ ఫారూఖ్ ఇన్‌చార్జి ప్రభుత్వ న్యాయవాదిగా నియమితులయ్యారు.

న్యూస్‌రీల్

ముగిసిన డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఏసీ కళాశాలలో రెండు రోజులపాటు జరిగిన డీఎస్సీ-2025 సెలెక్టెడ్ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్ పాఠశాలల్లో భర్తీ చేసేందుకు నిర్ణయించిన 1,143 పోస్టులతోపాటు జోనల్ స్థాయిలో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న మోడల్, ఆశ్రమ, సాంఘిక సంక్షేమ పాఠశాలల్లోని 572 పీటీజీ, టీజీటీ, పీడీ, పీఈటీ పోస్టులవారీగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. గురువారం 930 మందికి సంబంధించి పరిశీలన పూర్తి కాగా, శుక్రవారం జోనల్‌స్థాయి పోస్టులకు ఎంపికైన అభ్యర్థులవి పరిశీలించారు. రెండు రోజుల వ్యవధిలో 1,650 మందికి పైగా అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. ఈ ప్రక్రియను ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, పరిశీలకురాలు పి.శైలజ, డీఈవోలు సీవీ రేణుక, చంద్రకళ, పురుషోత్తంలు పర్యవేక్షించారు.

డీడీగా విధుల్లో చేరిన పాల్ సుధాకర్



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ) కార్యాలయం డెప్యూటీ డైరెక్టర్‌గా బండి పాల్ సుధాకర్ శుక్రవారం విధుల్లో చేరారు. గుంటూరు ఆర్డీగా పనిచేస్తున్న గుర్రం శ్రీనివాసులు రెడ్డి జేడీగా పదోన్నతి పొంది విజయవాడ డీఎంఈ కార్యాలయానికి బదిలీ కావడంతో ప్రభుత్వం పాల్ సుధాకర్‌ను డీడీగా నియమించింది. విధుల్లో చేరిన పాల్ సుధాకర్ ఆర్డీ డాక్టర్ శోభారాణిని కలిసి జాయినింగ్ రిపోర్టు అందజేశారు. డీడీగా విధుల్లో చేరిన పాల్ సుధాకర్‌ను కార్యాలయం సూపరింటెండెంట్లు సత్యం, రామకృష్ణ, సీనియర్ అసిస్టెంట్లు, పలువురు కార్యాలయ ఉద్యోగులు, పలువురు వైద్యులు, వైద్య సిబ్బంది అభినందించారు.

ఏషియన్ షూటింగ్ పోటీల్లో ముఖేష్‌కు పతకాల పంట



గుంటూరు వెస్ట్ (క్రీడలు): కజకిస్తాన్‌లోని షెమ్కెంట్‌లో జరుగుతున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్ షిప్‌లో గుంటూరుకు చెందిన షూటర్ నేలవల్లి ముఖేష్ పతకాల పంట పండించాడు. శుక్రవారం జరిగిన ఫైనల్లో 50 మీటర్ల ఫ్రీ పిస్టల్, 25 మీటర్ల స్టాండర్డ్ పిస్టల్ , 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ టీమ్ విభాగాల్లో 3 బంగారు పతకాలు, 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకం సాధించాడు. భారత్ జూనియర్ జట్టులో సభ్యుడైన ముఖేష్ కొన్ని సంవత్సరాలుగా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో నిలకడగా రాణిస్తున్నాడు. రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి వ్యక్తిగా అరుదైన రికార్డును సైతం నెలకొల్పాడు. ఈ సందర్భంగా ముఖేష్‌ను రైఫిల్ అసోసియేషన్ ఇండియా అధ్యక్ష, కార్యదర్శులు సలలిత్, రాజ్ కుమార్‌తోపాటు కేఎల్ యూనివర్సిటీ స్పోర్ట్స్ డీన్ హరికిషోర్‌లు అభినందించారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లి రోడ్డు కోట బజార్‌లో పునర్నిర్మాణం జరుపుకొంటున్న వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి పట్టణానికి చెందిన కొండేపాటి మంగేశ్వరరావు, సామ్రాజ్యం దంపతులు రూ.లక్ష విరాళంగా అందించారు. ఆలయంలో శుక్రవారం పూజలు నిర్వహించిన మంగేశ్వరరావు దంపతులు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కోవూరి శివ శ్రీనుబాబు, వనమా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమిగా ఖజానాకు గండి!

- బార్లకు అంతంతమాత్రంగానే దరఖాస్తులు
- సిండికేట్‌గా మారి చక్రం తిప్పిన కూటమి నేతలు
- స్పందన లేదనే సాకుతో లైసెన్స్ వంటి ఫీజులు తగ్గించే యత్నం
- ప్రభుత్వ ఖజానాకు భారీగా పడనున్న గండి
- జిల్లాలో 54కుగాను 21 బార్‌లకే నిబంధన మేరకు వచ్చిన దరఖాస్తులు
- నేడు లాటరీ విధానంలో కేటాయింపు
- 33 బార్లకు ఒక్కటీ దాఖలు కాని వైనం

కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతుండగా.. కూటమి నేతల జేబులు నిండిపోతున్నాయి. బార్ పాలసీ నిర్ణయించి ఇటీవల వాటి ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం తమ వారికి మేలు చేసేలా జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఎక్కడికక్కడ కూటమి నేతలు సిండికేట్‌గా మారి ప్రభుత్వ ఖజానాకు గండి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు.

బార్‌ల దరఖాస్తు దాఖలులో సిండికేట్‌గా కూటమి నేతలు



నరసరావుపేటలోని ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కేంద్రం

నరసరావుపేట టౌన్: మద్యం విక్రయాలతో పెద్ద ఎత్తున ఆదాయం సమకూర్చుకునే పనిలో కూటమి ప్రభుత్వం ఉంది. ఇప్పటికే వైన్స్‌ల ద్వారా తమవారికి దుకాణాలు కట్టబెట్టింది. ఇప్పుడు బార్ల ఏర్పాటుతో మద్యం ఏరులై పారించడానికి ప్రయత్నిస్తోంది. మరోవైపు కూటమికి చెందిన వారు సిండికేటుగా మారి బార్‌లకు ఇతరుల దరఖాస్తులు రాకుండా అడ్డుకుంటున్నారు. బార్ల లైసెన్సు విషయంలో ప్రభుత్వం ఇప్పటికే మూడు రోజుల పాటు గడువు పొడిగించింది. పల్నాడు జిల్లాలో ఓపెన్ కేటగిరీలో 49, గీత కులాలకు 5 కలిపి మొత్తం 54 బార్ అండ్ రెస్టారెంట్లకు దరఖాస్తులు ఆహ్వానించారు. తొలుత ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 26వ తేదీతో గడువు ముగిసింది. ఆశించిన మేర స్పందన రాలేదని చెబుతూ 29 వరకు గడువు పెంచారు. చివరి రోజైన శుక్రవారం రాత్రి 7 గంటల వరకు 16 ఓపెన్ కేటగిరీ, 5 గీత కులాల కేటగిరీ బార్‌లకు నాలుగేసి చొప్పున దరఖాస్తులు అందాయి. దీంతో వీటికి శనివారం లాటరీ విధానంలో కేటాయింపు ప్రక్రియ జరగనుంది. మిగిలిన వాటికి స్పందన లేకపోవడంతో తిరిగి దరఖాస్తులను స్వీకరించాల్సి ఉంటుంది. శుక్రవారం అర్ధరాత్రి వరకు గడువు ఉండడంతో మరికొన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముంది. బార్లకోసం దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలుగా నిర్ణయించారు. ఒక్కొక్క బార్‌కు 4 దరఖాస్తులు వస్తేనే లాటరీ పద్ధతిలో కేటాయించేలా నిబంధన పెట్టారు. జనరల్ కేటగిరీలోని దాచేపల్లి, గురజాల నగర పంచాయతీలు మినహా మిగిలిన బార్లకు ఏడాదికి రూ. 55 లక్షలు లైసెన్సు ఫీజుగా నిర్ణయించారు. ఈ మొత్తాన్ని ఆరు విడతలుగా చెల్లించేలా నిబంధన పెట్టారు. దాచేపల్లి, గురజాల బార్లకు మాత్రం రూ. 35 లక్షలు ఫీజుగా నిర్ణయించారు. మరోవైపు ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన ఐదు బార్లకు దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలు పెట్టి, లైసెన్సు ఫీజును మాత్రం ఒక్కోదానికి రూ. 27.50 లక్షలుగా నిర్ణయించింది.

తక్కువకే కొట్టేసేందుకు కుట్ర...

ఇప్పటికే మద్యం షాపుల కోసం సిండికేట్‌గా మారి అన్ని దుకాణాలను తమ గుప్పిట్లో పెట్టుకున్న కూటమి నేతలు... ఇప్పుడు బార్ అండ్ రెస్టారెంట్‌ల విషయంలో సైతం అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. ఆదాయాన్ని పెంచుకునేందుకు దరఖాస్తులను తక్కువగా వేసి ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వచ్చేలా వ్యూహం రచించారు. సిండికేట్ సూచించిన వారు మాత్రమే పరిమితంగా దరఖాస్తులు వేశారు. ప్రభుత్వం కూడా మద్యం వ్యాపారులు ముందుకు రాలేదన్న సాకు చూపి లైసెన్స్ ఫీజు, మార్జిన్ అమౌంట్ తగ్గించే యోచనలో ఉన్నట్లు సమాచారం. దీంతో సగానికి పైగా బార్‌లకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. ఈ వ్యవహారం ఎక్సైజ్ అధికారులకు తలనొప్పిగా మారింది. బార్ల దరఖాస్తులు, లాటరీ, లైసెన్సుల వ్యవహారాలను సజావుగా పూర్తి చేసే బాధ్యతలను ప్రభుత్వం వారిపై పెట్టింది. కానీ కూటమి నేతల తీరుతో అన్ని బార్లకు దరఖాస్తులు వచ్చేలా చూడాలని అధికారులు చేసిన ప్రయత్నాలు మాత్రం విఫలమయ్యాయి.



విక్రయానికి సిద్ధంగా ఉన్న మద్యం

‘ధన’నాథుడు...



కాకతీయనగర్‌లోని శ్రీసాయిరామ్ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలో గణనాథుడిని శుక్రవారం కరెన్సీ నోట్లతో విశేషంగా అలంకరించారు. దాదాపు రూ.22 లక్షల విలువైన నోట్లతో గణనాథుడు, మండపాన్ని అలంకరించినట్టు నిర్వాహకులు తెలిపారు. - నరసరావుపేట

రూ. 6.40 లక్షలు పలికిన ఆనంద్‌పేట లడ్డూ



లడ్డూను దక్కించుకున్న ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి



లడ్డూతో అబ్బులు యువసేన సభ్యులు

రెంటచింతల: స్థానిక ఆనంద్‌పేట కాలనీలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద 90 కేజీల లడ్డూను, 30 గ్రాముల వినాయక స్వామి వారి బంగారు లాకెట్‌ను ఇగుటూరి రాజశేఖర్‌రెడ్డి రూ. 6.40 లక్షలకు వేలంపాటలో దక్కించుకున్నారు. సుమారు రెండు గంటల పాటు ఊరేగింపు కొనసాగింది. ప్రధాన రహదారిపై ఆనంద్‌పేట యువత కేరింతలు పెట్టారు. వందల మంది భక్తులు తరలివచ్చారు. గత ఏడాది లడ్డూను గొంటు ఆదిరెడ్డి రూ. 7.10 లక్షలకు దక్కించుకున్నారు.

రూ. మూడు లక్షలకు పైగా ధర పలికిన లడ్డూ

పెదకాకాని: మండలంలోని వెనిగండ్ల గ్రామంలో గురువారం రాత్రి వినాయక లడ్డూ వేలం నిర్వహించారు. వేమారెడ్డి గుడి సెంటర్‌లో రెడ్డి యూత్ ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి బుర్రముక్కల శ్రీనివాసరెడ్డి 25 కిలోల లడ్డూ, తియ్యగూర శ్రీ ప్రియాంక రెడ్డి 20 కిలోల లడ్డూ, పులగం వేమారెడ్డి 11 కిలోల లడ్డూ సమర్పించారు. వేలంలో అబ్బులు(ఆత్మకూరి శేషిరెడ్డి) యువసేన 25 కిలోల లడ్డూను రూ.3,01,116లకు దక్కించుకుంది. 20 కిలోల లడ్డూ రూ.40 వేలకు, 11 కిలోల లడ్డూ రూ.40 వేలకు భక్తులు దక్కించుకున్నారు. అనంతరం వినాయక విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు.

టీడీపీ నాయకులు బాధ్యత వహించక తప్పదు



వైఎస్సార్ సీపీ శ్రేణులతో సబ్‌జైలు వద్దకు వచ్చిన డాక్టర్ గోపిరెడ్డి

- హెచ్చరించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- తప్పుడు కేసులకు భయపడేది లేదు
- న్యాయం పోరాటం చేసి విడిపించుకుంటాం
- సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పరామర్శ

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు ఫిర్యాదులు చేసి వారిని జైలు పాలు చేస్తున్న టీడీపీ నాయకులు తప్పకుండా బాధ్యత వహించాల్సి వస్తుందని మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. స్థానిక సబ్ జైలులో అక్రమ కేసుపై రిమాండ్‌లో ఉన్న వినుకొండరోడ్డు శ్రీనివాసగిరిజన కాలనీకి చెందిన పార్టీ కార్యకర్తలను శుక్రవారం సాయంత్రం పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ రాత్రి గిరిజన కాలనీలో ఉండే టీడీపీ కార్యకర్త శివకృష్ణ తన ఇంటిపై తానే తన అనుచరులచేత పెట్రోలు బాంబులు వేయించుకున్నాడన్నారు. ఈ పని వైఎస్సార్‌సీపీ వారు చేశారంటూ నలుగురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారన్నారు. మరుసటి రోజు తెల్లవారు జామునే వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లకు పోలీసులు వచ్చి ఈశ్వరరెడ్డి, మల్లి, సాంబశివరావు, గోపీలను పోలీసుస్టేషన్‌కు తీసుకొచ్చారన్నారు. వీరు నిజంగా తప్పుచేసి ఉంటే ఇళ్లలో ఉండే వారా అని డాక్టర్ గోపిరెడ్డి ప్రశ్నించారు. వారిపై యల్లమంద గ్రామ టీడీపీ నాయకుడు యరమాసు ప్రసాదు అన్యాయంగా కేసు నమోదు చేయించారన్నారు. సీసీపుటేజ్‌లో ఎక్కడా వీరు నలుగురు లేకపోయినప్పటికీ వారి ఎల్లో మీడియాలో టీవీ-5 ద్వారా వైఎస్సార్‌సీపీ వారిపై ప్రచారం చేయించారన్నారు. టీడీపీ నాయకుడు కొల్లి బ్రహ్మయ్య స్వయంగా పోలీసులకు ఫోన్‌చేసి ఒత్తిడి తీసుకురావటంతో ఎక్స్‌ప్లోజివ్ యాక్ట్ కింద వీరిపై అన్యాయంగా నాన్‌బెయిల్ కేసు పెట్టారన్నారు. ఈ మేరకు సబ్‌జైలులో ఉన్న వారిని పరామర్శించేందుకు తామంతా వచ్చామన్నారు. ఇలాంటి అన్యాయాలు, అక్రమాలు, అన్నింటిని సవాల్‌గా స్వీకరించి న్యాయపరంగా ఎదుర్కొంటామన్నారు. తమకంటూ ఒకరోజు వస్తుందని, అప్పుడు టీడీపీ నాయకులు అందరూ బాధ్యత వహిస్తూ గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. గోపిరెడ్డి వెంట జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, పట్టణ కోశాధికారి అన్నామోహన్, నాగూల్‌మీరా, వరవకట్ట బుజ్జి, విద్యుత్ శ్రీనివాసరెడ్డి, తదితరులు ఉన్నారు.

శాంతించిన కృష్ణమ్మ

కొల్లూరు: కృష్ణమ్మ శాంతించింది. నదీ తీర గ్రామాల వాసులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రకాశం బ్యారేజ్ నుంచి గురువారం సముద్రంలోకి విడుదల చేస్తున్న వరద నీటి పరిమాణం పెరగడంతో నదిలో నీటిమట్టం అర్ధరాత్రి నుంచి క్రమక్రమంగా పెరిగి లోతట్టు ప్రాంతాలలోకి వరద నీరు చేరింది. 4.38 లక్షల క్యూసెక్కులు దిగువుకు విడుదల చేసిన కారణంగా మండలంలోని పోతార్లంక, గాజుల్లంక, చింతర్లంక గ్రామాల పరిధిలో సాగు చేసిన వాణిజ్య పంటలు వరద ముంపునకు గురయ్యాయి. మండలంలోని దోనేపూడి -పోతార్లంక గ్రామాల నడుమ ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు వరద నీటి విడుదల తగ్గుతుండటంతో నీటిపారుదల శాకాధికారులు దిగువకు నీటి విడుదలను గణనీయంగా తగ్గించి శుక్రవారం సాయంత్రానికి 2.96 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ నుంచి నీటి విడుదల తగ్గుముఖం పట్టడంతో మొదటి విడత ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. నదిలో నీటిమట్టం తగ్గుముఖం పట్టడంతో నదీ పరివాహక ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కొల్లూరు మండలం గాజుల్లంక -పోతార్లంక మధ్య కంద పంటలోకి చేరిన వరద నీరు

ఉత్సాహం..కారాదు విషాదం

- గణేష్ నిమజ్జనాల్లో అప్రమత్తత తప్పనిసరి
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పోలీసులు
- జిల్లాలో 3 వేలకు పైగా వినాయక మండపాలు



సత్తెనపల్లిలో గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న ఉత్సవ కమిటీ ప్రతినిధులు



వినాయక నిమజ్జనాలు చేసే గుంటూరు బ్రాంచ్ కెనాల్

సత్తెనపల్లి: జిల్లాలో గణపతి నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం నాటికి ఉత్సవాలు ప్రారంభమై మూడు రోజులు అయ్యాయి. ఇప్పటికే ఈ క్రమంలో కొన్ని పందిళ్లలో ఏర్పాటు చేసిన గణనాథులను కమిటీల ప్రతినిధులు శుక్రవారం నిమజ్జనంకు తరలించారు. కాగా నిమజ్జనాలు సందర్భంగా వివిధ ప్రాంతాల్లో పలు ప్రమాదాలు గతంలో చోటు చేసుకున్న నేపథ్యంలో ఈ నిమజ్జనాల్లో ప్రాణ నష్టం సంభవించకుండా ఉండాలంటే అప్రమత్తత ఒక్కటే నివారణ అని అధికారులు చెబుతున్నారు. ఎంతో ఆనందంతో ఉత్సాహంగా నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా కొన్ని జాగ్రత్తలు తప్పక పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

ఆధ్యాత్మికతకు అద్దం...

జిల్లాలో పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా వీధి వీధిన కొలువైన గణనాథులతో ఎటు చూసినా ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం కొలువు తీర్చిన ప్రతిమలను ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ఘనంగా పూజలు నిర్వహించి ఉత్సవ కమిటీల ప్రతినిధులు ఆధ్యాత్మికతను పంచుతున్నారు. ఉత్సవాల ముగింపు ప్రక్రియ శుక్రవారం నుంచే ప్రారంభమైంది. ఉత్సవాలు ప్రారంభించిన అనంతరం మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో రోజు నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో మూడవరోజు శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో గణనాథులను వేడుకగా నిమజ్జనానికి ఉత్సవ కమిటీల ప్రతినిధుల ఆధ్వర్యంలో తరలించారు.

అప్రమత్తత అవసరం...

- గణేష్ మండపాలకు సమీపంలో విద్యుత్ తీగలు ఉంటే అగ్ని ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంది.
- ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండపాల్లో విద్యుత్ ప్రమాదాలకు తావు లేకుండా అప్రమత్తంగా ఉండాలి.
- ఎత్తయిన విగ్రహాలను నిమజ్జనానికి తరలించే సమయంలో డీజే బాక్సులు, వాహనాలపై ఎక్కి నిల్చోవడం పరిపాటిగా జరుగుతోంది. ఇలాంటి సందర్భాల్లో మార్గం మధ్యలో వేలాడే విద్యుత్ తీగలతో ప్రమాదం పొంచి ఉంటుంది.
- రహదారుల్లో వ్యతిరేక మార్గంలో ఊరేగించడం, ఎక్కువమంది రోడ్డు మధ్యలో నడిస్తే వాహన ప్రమాదాలకు గురి కావచ్చు.
- గణేష్ విగ్రహాల ఏర్పాటు ఒక ఎత్తయితే మండపాల నిబంధనలను నిరంతరం నిర్వాహకులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.ఏ చిన్న ప్రమాదం జరిగినా అది ఏ పరిణామాలకు దారి తీస్తుందో చెప్పలేం. కాబట్టి నిమజ్జనం వరకూ విగ్రహాల వద్ద వంతుల వారీగా నిర్వాహకులు పర్యవేక్షిస్తూ ఉండాలి.
- మద్యం మత్తులో వేడుకల్లో పాల్గొనడం, నిమజ్జన సమయంలో నీటిలోకి దిగి ప్రాణాల పైకి తెచ్చుకోవడం సరికాదని అధికారులు అంటున్నారు. ఉత్సవాలు ముగిసే వరకూ మద్యం జోలికి వెళ్లకుండా ఉండడమే ఉత్తమమని పేర్కొంటున్నారు.

సుమారు 3 వేలకుపైగా మండపాలు...

గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు జిల్లాలో మూడు వేలకు పైగా మండపాల్లో గణనాథులను కొలువు తీర్చారు. ప్రతి గ్రామంలో రెండు నుంచి మూడు విగ్రహాలు, పట్టణాల్లో ప్రతి వార్డులో కనీసం రెండు వినాయక మండపాలను పోటాపోటీగా ఏర్పాటు చేశారు. కాగా చిన్న పరిమాణంలో ఉన్న ప్రతిమలు వందలోనే ఉన్నాయి. ఇళ్లల్లో ఏర్పాటు చేసిన గణపతులను చాలా మంది గురువారం ఉదయం నిమజ్జనం చేశారు. జిల్లాలో నరసరావుపేటకు సంబంధించి నకరికల్లు అడ్డరోడ్డులోని ఎన్నెస్పీ కాలువలో, వినుకొండకు సంబంధించి గంటవారిపాలెం సాగర్ ఎడమ కాలువ అద్దంకి బ్రాంచ్‌కెనాల్‌లో, చీకటీగలపాలెం గుండ్లకమ్మలో, నూజెండ్ల మండలానికి గుండ్లకమ్మ, బొల్లాపల్లి, ఈపూరు మండలాలకు సాగర్ కుడి కాలువలో, సత్తెనపల్లికి గుంటూరు రోడ్ లోని గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో, ముప్పాళ్లకు ఎన్నెస్పీ కాలువలో, చిలకలూరిపేట, మాచర్ల, గురజాల, పెదకూరపాడు నియోజక వర్గాలకు సాగర్ కాలువలు, కృష్ణానది ప్రాంతాల్లో, చెరువుల్లో నిమజ్జనాలకు అనుకూలంగా ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో నిమజ్జనానికి అధికారులు ఏర్పాట్లు చేశారు.

నిమజ్జనంలో నిబంధనలు పాటించాలి

జిల్లా అడిషనల్ ఎస్పీ సంతోష్

శావల్యాపురం: వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో కమిటీ సభ్యులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అడిషనల్ ఎస్పీ జేవీ సంతోష్ అన్నారు. శుక్రవారం మండలంలోని గంటావారిపాలెం గ్రామ సమీపాన ఉన్న అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రాంతాన్ని పరిశీలించి, స్థానిక పోలీసులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిమజ్జనం సమయంలో ఘర్షణలకు తావులేకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో నిఘా ఉంచామన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిటీ సభ్యులను బాధ్యులుగా చేస్తామని తెలిపారు. నిమజ్జనం సమయంలో నీటిలోకి ఎవరూ దిగరాదని, ఈత కొట్టరాదని తెలిపారు. గతంలో అనేక ప్రమాదాలు జరిగాయని గుర్తుచేశారు. పోలీసు బందోబస్తుతోపాటు గజ ఈతగాళ్లను కూడా అందుబాటులో ఉంచామని తెలిపారు. రాత్రి సమయంలో ఇబ్బంది లేకుండా ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఎస్సై లేళ్ళ లోకేశ్వరరావు, రైటరు బాషా, ఎస్‌బీ కానిస్టేబుల్ రమేష్, సిబ్బంది శివ తదితరులు పాల్గొన్నారు.



సూచనలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ సంతోష్



పసుపు ధరలు
(శుక్రవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 72

కొమ్ములు : 51 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,500	9,050	9,050

కాయలు : 21 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
8,500	10,325	10,325

మొత్తం అమ్మకాలు : 54.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మిర్చి యార్డు సమాచారం
(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	36,246
అమ్మకాలు	41,057
నిల్వ	5,504

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,200
నంబరు–5	10,000–13,500
341	10,000–15,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–14,000
నంబరు–5	10,000–13,600
341	11,000–15,500
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,200
సంగీ బాడిగ 5531	10,000 – 14,600
ఆర్మూర్	9,800 – 12,200
తాలుకాయలు	6,200 – 7,600

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్–1	10,000 – 15,300
సంగీ బాడిగ 5531	10,000 – 14,000
తాలు	5,400 – 7,300

–కొరిటిపాడు (గుంటూరు)

రసవత్తరంగా జాతీయ యోగా పోటీలు



యోగా విన్యాసాల ప్రదర్శన పోటీకి సిద్ధమవుతున్న యోగాసాధకులు

చిలకలూరిపేటటౌన్/యడ్లపాడు: నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) ఆధ్వర్యంలో చిలకలూరిపేట రూరల్ మండలం మద్దిరాల పీఎంశ్రీ జవహర్ నవోదయ విద్యాలయం వేదికగా జరుగుతున్న జాతీయస్థాయి యోగా విన్యాసాల ప్రదర్శన పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. భోపాల్, చండీఘర్, జైపూర్, హైదరాబాద్, లక్నో, పూనే, పాట్నా, షిల్లాంగ్ జేఎన్‌వీ రీజియన్ల పరిధిలోని ఒక్కొక్క రీజియన్ నుంచి బాలురు, బాలికలు 42 మంది చొప్పున 336 యోగాసాధకులు, టీంలీడర్, సంరక్షకులు హాజరయ్యారు. శుక్రవారం హైదరాబాద్ నవోదయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్ డి చక్రపాణి రెండోరోజు పోటీల నిర్వహణను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.

వివిధ విభాగాల్లో ఉత్సాహంగా పోటీలు

అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా జాతీయస్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నారు. వీటిలో యోగ ఆసనాలు, ఆర్టిస్టిక్ యోగా, రిథమిక్ యోగా వంటి కేటగిరీలతో పాటు, ఉత్తమ యోగి (బెస్ట్ యోగి), ఉత్తమ యోగిని (బెస్ట్ యోగినీ) వంటి ప్రత్యేక విభాగాల్లోనూ తీవ్రపోటీ నెలకొంది. తొలిరోజున బాలబాలికలు వివిధ ఆయా విభాగాల్లో అబ్బురపరిచే యోగా ప్రదర్శనలతో మెప్పించారు. రెండో రోజైన శుక్రవారం ఆర్టిస్టిక్ విభాగంలో అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. పోటీలకు రాష్ట్ర ప్రభుత్వ, వివిధ అసోసియేట్స్‌కు చెందిన యోగా అఫీషియల్స్ 15 మంది వ్యవహరిస్తున్నారు. ఆయా పోటీలను మద్దిరాల పీఎంశ్రీ జేఎన్‌వీ విద్యాలయ ప్రిన్సిపల్ నల్లూరి నరసింహారావు పర్యవేక్షణలో వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, పీఈటీలు ఆర్ పాండు రంగారావు, జి గోవిందమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సహకారం అందించారు. జాతీయస్థాయి యోగా పోటీల ముగింపు సభ శనివారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించనున్నారు.

డాక్టర్ బీఆర్ సుషీల్‌కు తెలుగు కీర్తి పురస్కారం



సుషీల్‌కుమార్‌కు పురస్కారం అందజేస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ

నరసరావుపేట: పట్టణానికి చెందిన విద్య, సామాజికవేత్త, సంరక్షణ సొసైటీ వ్యవస్థాపకుడు, గుర్రం జాషువా మూడో తరం వారసుడు డాక్టర్ బీఆర్ సుషీల్‌కుమార్‌కు తెలుగు కీర్తి పురస్కారం లభించింది. గురువారం హైదరాబాదు నాంపల్లిలోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని నిర్వహించారు. మాతృభాష, సంస్కృతి, సాంప్రదాయ పరిరక్షణలో భాగంగా లలిత కళలు, సామాజిక సేవ, విద్య, వైద్య, క్రీడా, కళా, జర్నలిజం, ఉద్యోగ రంగాల్లో సేవలు అందజేస్తున్నందుకు గాను పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ అద్దంకి రాజా, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలచారి చేతుల మీదుగా తనకు జ్ఞాపికతో ప్రశంసాపత్రం అందజేసినట్లు సుషీల్‌కుమార్ శుక్రవారం తెలిపారు.

క్రీడలతో వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు

నరసరావుపేట రూరల్: క్రీడలతో వ్యక్తిత్వ వికాసం, ఆరోగ్యంతోపాటు పోటీతత్వం అలవడుతుందని జేఎన్‌టీయూఏఎన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని కళాశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శారీరక విద్య విభాగాధిపతి డాక్టర్ జీపీ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు. జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బాలురకు వాలీబాల్, బాలికలకు త్రోబాల్ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ మల్లికార్జున్, డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.కృష్ణారెడ్డిలు బహుమతులు అందజేశారు. ఆరోగ్యవంతమైన శరీరంలో ఆరోగ్యవంతమైన మనసు ఉంటుందని ఎంఎఎం కళాశాలల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు తెలిపారు. కళాశాలలో నిర్వహించిన నేషనల్ స్పోర్ట్స్ డేలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విజిలెన్స్ తనిఖీలు



కామేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

పిడుగురాళ్ల రూరల్: పిడుగురాళ్ల మండలంలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శివాజీ తెలిపిన వివరాలు.. మండలంలోని కోనంకి, బ్రాహ్మణపల్లి, కామేపల్లి గ్రామాల్లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను అధికారులు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం అందిస్తున్నారా? బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారా? అంగన్‌వాడీ కేంద్రాలు అందించే సేవల నాణ్యతను, కోడిగుడ్లు, పాలు, టేక్–హోమ్ రేషన్ వంటి సరుకులు సక్రమంగా లబ్ధిదారులకు అందుతున్నాయో లేదో తనిఖీ చేశారు. రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారో లేదో పరిశీలించారు. కేంద్రాల పరిశుభ్రత, ముఖ్యంగా బాత్‌రూమ్‌ల నిర్వహణను పరిశీలించారు. గర్భిణులు, బాలింతల గృహ సందర్శనలు సక్రమంగా జరుగుతున్నాయో లేదా అనే విషయాలు పరిశీలించారు. అనంతరం రికార్డులు పరిశీలించి అన్ని సక్రమంగా ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజలి కుమారి తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష జననాలు సమానంగా ఉండేలా చూడాలి

జిల్లా మల్టీమెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమీక్ష సమావేశంలో జేసీ సూరజ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్

నరసరావుపేట: జిల్లాలో స్త్రీ, పురుష పుట్టుక సమానంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, డిస్ట్రిక్ లెవెల్ అప్రేట్ అథారిటీ చైర్‌పర్సన్ సూరజ్ గనోరే ప్రభుత్వ వైద్యశాఖ, ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాల ప్రతినిధులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏఆర్టి సరోగసి యాక్ట్ 2021, రూల్స్ 2022, గర్భలింగ నిర్ధారణ పరీక్ష నిషేధం చట్టం 1994, రూల్స్1996 (ప్రోహిబిషన్ ఆఫ్ సెక్స్ సెలక్షన్) అమలు తీరుపై జిల్లా మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ ప్రస్తుతం సీఆర్ఎస్ పోర్టల్–2025 ప్రకారం జిల్లాలో స్త్రీ జననం 932గా ఉందని, దానిని 1000కి సమంచేస్తూ లింగ నిష్పత్తిని సాధించాలని సూచించారు. గర్భస్రావాలు నిర్వహించి భ్రూణ హత్యలకు పాల్పడే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రవి అప్లికేషన్ అన్నింటి గురించి వివరించారు. జిల్లా బెడ్ పోర్టల్‌లో నమోదు కాబడిన అప్లికేషన్లను పరిశీలించి సమీక్ష చేసి నూతన సర్టిఫికేట్ రిజిస్ట్రేషన్ కోసం, రెన్యువల్స్, మోడిఫికేషన్ దరఖాస్తులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో వచ్చిన అప్లికేషన్లు అప్రూవల్ చేశారు. నూతనంగా పీసీపీఎన్‌డీటీలో రిజిస్ట్రేషన్ ఆఫ్ సర్టిఫికెట్ కోసం వచ్చిన ఎనిమిది దరఖాస్తుల్లో మూడింటిని అప్రూవల్ చేశారు. ఏఆర్‌టి యాక్ట్ క్రింద కొత్తగా రెండింటిని అప్రూవల్ చేశారు. సరోగసి ప్రొసీజర్ నిర్వహణ కోసం ఎలిజిబిలిటీ సర్టిఫికెట్స్ అప్రూవల్ చేశారు. కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

అమరావతి చేరుకున్న బుద్ధ సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర



ధ్యానబుద్ధ విగ్రహం వద్ద అధికారులతో మోటార్ సైకిల్ యాత్ర బృందం

అమరావతి: బౌద్ధ నాగరికతకు ప్రతీకగా నిలిచిన అమరావతి స్తూపం వద్దకు శుక్రవారం ఉదయం త్రివిధ దళాలకు చెందిన లార్డ్ బుద్ద సర్క్యూట్ మోటార్ సైకిల్ యాత్ర బృందం చేరుకుంది. భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, గృహ మంత్రిత్వ శాఖ, ల్యాండ్ పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, నలందా యూనివర్సిటీ, బిమ్‌స్టెక్ సెక్రటేరియెట్ సహకారంతో చేపట్టిన యాత్ర తొలుత రాష్ట్రంలో ఈనెల 25వ తేదీన రాజమండ్రిలో ప్రవేశించింది. విజయవాడ మీదుగా శుక్రవారం అమరావతికి చేరుకుంది. యాత్రలో భారత రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన త్రివిధ దళాల అధికారులు, బిమ్‌స్టెక్ దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. యాత్రకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న రాహుల్ పాటిల్ మాట్లాడుతూ యాత్ర ద్వారా భగవాన్ బుద్ధుని సందేశమైన శాంతి, కరుణ, సౌభ్రాతృత్వం భారతదేశం అంతటా వ్యాపించేలా చేసే ప్రయత్నమని అన్నారు యాత్రకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, జిల్లా పరిపాలన యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకారం అందించాయన్నారు. యాత్ర బృందానికి ధ్యానబుద్ధ విగ్రహం వద్ద పల్నాడు జిల్లా పర్యాటకశాఖ అధికారి జి నాయుడమ్మ, తహసీల్దార్ ఎం. డేనియల్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. అచ్చయ్య, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ యూనిట్ మేనేజర్ పి. మణికుమార్‌లు స్వాగతం పలికారు. ధ్యానబుద్ధ ప్రాజెక్టులో ఉన్న బుద్ధుని జీవిత విశేషాలతో కూడిన శిల్పాలను బృందం తిలకించింది. అనంతరం బృందం ఒంగోలు బయలుదేరి వెళ్లింది.

హత్యాయత్నం కేసులో నిందితులకు మూడేళ్ల జైలు

నరసరావుపేట టౌన్: వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడినట్లు నేరం రుజువు కావటంతో ఏడుగురు నిందితులకు ఒక్కొక్కరికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ అవునపు సెషన్స్ జడ్జి ఎస్.లావణ్య శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వీర నాగ వెంకట సత్యనారాయణ, సీహెచ్.నాని, ఎం.చిన్న వెంకయ్య, రామిశెట్టి రవి, వి.ఈశ్వర వరప్రసాద్, ఎస్.భవానీశంకర్, మరి కొంతమంది ఓ వర్గ సంఘం పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేశారు. సదరు గ్రూపు ఆ సంఘానికి నిధులను సమీకరించింది. నిధులు దుర్వినియోగం అవుతున్నాయని చిలకలూరిపేటకు చెందిన తోట నాగవేణు గ్రూపులో స్పందించారు. ఆగ్రహించిన గ్రూపులోని సభ్యులు 2021 జనవరి 29వ తేదీన చిలకలూరిపేటకు వచ్చి ఫిర్యాది నాగ వేణు గృహంలోకి అక్రమంగా ప్రవేశించి అతనిపై హత్యయత్నానికి పాల్పడ్డారు. చుట్టుపక్కల వారు రావడంతో నిందితులు అక్కడ నుంచి పారిపోయారు. ఈ మేరకు బాధితుడు చిలకలూరిపేట పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితులను అరెస్టు చేసి కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో హత్యాయత్నానికి మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5000 జరిమానా, అక్రమంగా గృహంలో ప్రవేశానికి మరో మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.5000 జరిమానా విధించారు. శిక్ష మొత్తం ఏకకాలంలో అనుభవించేలా తీర్పులో పేర్కొన్నారు. గత నెల 24వ తేదీన నేరం రుజువైనట్లు న్యాయమూర్తి ప్రకటించారు. నిందితులు కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారంట్ జారీ చేశారు. పోలీసులు నిందితుల కోసం గాలిస్తుండగా, స్వచ్ఛందంగా శుక్రవారం కోర్టులో లొంగిపోయారు. దీంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్షను ఖరారు చేస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ ఏపీపీ గుండాల సురేష్‌బాబు నిర్వహించారు.

ఏఎన్‌యూ దూరవిద్య పీజీ కోర్సులకు నోటిఫికేషన్

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (సీడీఈ) పీజీ దూర విద్య ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు సీడీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ గడువు అక్టోబర్ 10వ తేదీతో ముగుస్తుందన్నారు. వివరాలకు ఏఎన్‌యూసీడీఈ. ఇన్‌ఫో అనే వెబ్‌సైట్‌ను సందర్శించాలని చెప్పారు.

రమాదేవికి తెలుగు కీర్తి అవార్డు ప్రదానం



సత్తెనపల్లి: సత్తెనపల్లికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సరికొండ రమాదేవి సాహిత్య రంగంలో చేస్తున్న సేవలు, సామాజిక సేవలను గుర్తించి గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు కీర్తి అవార్డును ఆమెకు ప్రదానం చేశారు. హైదరాబాదులోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఈనెల 28న జరిగిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి తెలుగు భాషా దినోత్సవంలో హరియాణా రాష్ట్ర మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, తదితరులు చేతుల మీదుగా తెలుగు కీర్తి అవార్డును, మెమొంటో, సర్టిఫికెట్, ముత్యాల పూసల దండ ఇచ్చి సన్మానించారు. డాక్టర్ సరికొండ రమాదేవిని పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ బాధ్యులు, వివిధ కళా సంస్థల అధినేతలు, సాహితి ప్రియులు, తదితరులు ప్రత్యేకంగా శుక్రవారం అభినందించారు.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 2,000 గరిష్ఠం : రూ. 3,000

మోడల్ ధర రూ. 2,600

పుష్కర ఘాట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం


కాపాడిన మత్స్యకారులు



మహిళను బయటకు తీసుకువస్తున్న మత్స్యకారుడు

తాడేపల్లి రూరల్: ప్రకాశం బ్యారేజ్ కృష్ణానది దిగువ ప్రాంతంలోని సీతానగరం పుష్కర ఘాట్ల వద్ద ఓ మహిళ కృష్ణానది వరద నీటిలోకి దిగి శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన మత్స్యకారులు ఆమెను కాపాడి తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సేకరించిన వివరాల ప్రకారం.. విజయవాడ భవానీపురంనకు చెందిన నరేంద్రతో ఏడాదిన్నర క్రితం యామినికి వివాహమైంది. గత ఆరు నెలలుగా వారి మధ్య మనస్పర్థలు రావడంతో యామిని భవానీపురంలోని తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. భర్త దగ్గరకు వెళ్లగా ఇంట్లో నుంచి బయటకు నెట్టడంతో మనస్తాపం చెంది సీతానగరం పుష్కర ఘాట్ల వద్దకు వచ్చింది. చనిపోవడానికి వరదనీటిలోకి దూకింది. పక్కనే పడవలను భద్రపరుస్తున్న మత్స్యకారులు గమనించి నీటిలోకి దిగి ఆమెను కాపాడారు. సమాచారం అందుకున్న తాడేపల్లి మహిళా పీఎస్ఐ అపర్ణ సంఘటనా స్థలానికి వెళ్లి యామిని తండ్రి శ్రీనివాసరావును పిలిపించారు. ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

ఏకగ్రీవంగా ఏపీఇఎస్ఎస్ఎ జిల్లా కార్యవర్గం ఎన్నిక



నరసరావుపేట: ఏపీ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ సబార్డినేట్ అసోసియేషన్ (ఏపీఇఎస్ఎస్ఎ) జిల్లా కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా అర్ధగణాంకాధికారి ఏ.మాలతీదేవి వ్యవహరించారు. అధ్యక్షులుగా ఏఎస్ఓ వి.ప్రభాకరరావు, ఉపాధ్యక్షులుగా డెప్యూటీ ఏఎస్ఓ ఎం.కృష్ణకిషోర్, కార్యదర్శిగా ఏఎస్ఓ పి.నాగేంద్రబాబు, జాయింట్ సెక్రటరీగా ఏఎస్ఓ జె.సూర్యనారాయణ, కోశాధికారిగా ఎస్వి.సుబ్రమణ్యంలను ఎన్నుకున్నారు.

తమ్ముడిని హత్య చేసిన నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ అజీజ్

నగరంపాలెం: తమ్ముడిని హత్య చేసిన నిందితుడిని పాతగుంటూరు పోలీసులు అరెస్ట్ చేసినట్లు తూర్పు సబ్ డివిజనల్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. శుక్రవారం పాతగుంటూరు పోలీస్‌స్టేషన్ (పీఎస్)లో సీఐ వెంకట ప్రసాద్‌తో కలసి డీఎస్పీ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ... ఎన్టీఆర్‌నగర్ ఒకటో వీధిలో ఉంటున్న కంచర్ల రమేష్, రామిరెడ్డితోట మూడో వీధికి చెందిన సురేష్ (30) సొదరులని తెలిపారు. ఆటోడ్రైవర్‌గా జీవనం సాగించే సురేష్‌కు సుమారు పదేళ్ల క్రితం మీరాబీతో ప్రేమ పెళ్లి అయ్యిందని అన్నారు. కొన్నాళ్లుగా అన్న, తమ్ముడి మధ్య నగదు పంపిణీ విషయమై గొడవలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన రాత్రి మణిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపాన ఇద్దరి మధ్య వివాదం నెలకొందని, ఈ క్రమంలో తమ్ముడిపై అన్న రమేశ్ పెట్రోలు పోసి నిప్పంటించాడని తెలిపారు. అతడిని జీజీహెచ్‌లో చేర్పించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో పాతగుంటూరు పోలీసులు కేసు నమోదు చేయగా, శుక్రవారం రమేష్‌ను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు.